క్లుప్తంగా

నేడు మండల సమావేశం

పీలేరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

హార్సిలీహిల్స్ టోల్ వసూళ్లలో రికార్డు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వచ్చే సందర్శకుల నుంచి వసూలు చేస్తున్న టోల్ ఎంట్రీ రుసుము రికార్డు స్థాయిలో వసూలైంది. ఈ రుసుము వసూళ్ల ప్రారంభమై రెండు దశాబ్దాలు గడిచాయి. ఇంత వరకు వసూలు కానంతంగాద సరా సెలవుల ముగింపు చివరి రోజులు శని, ఆదివారాల్లో వసూలైంది. శనివారం రూ.33,510 వసూలైతే ఆదివారం రూ.35,450 వసూలైంది. దసరా సెలవులు వారాంతం కావడంతో ఈ స్థాయిలో ఆదాయం వచ్చింది. ఈ రెండు రోజుల ఆదాయంపై రెవెన్యూ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల ఒకటి నుంచి టౌన్‌షిప్ కమిటి తరపున వీఆర్ఏలు టోల్ వసూలు చేస్తున్నారు. గడచిన 13 రోజుల్లో రూ.3,90,160 ఆదాయం వచ్చింది.

ప్రయాణికులకు మెరుగైన సేవలు


మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమిష్టిగా పని చేసి సంస్థకు మంచి పేరు తేవాలని కోరారు. సమయపాలన పాటించాలన్నారు. ఈపీకె, కెంఎంపీఎల్ పెంచాలన్నారు. కార్గో ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

శివలింగానికి పాలాభిషేకం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయంలో సోమవారం సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో శివ లింగానికి పాలాభిషేకం చేశారు. ఉదయం నుంచే ఆలయంలో పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, పంచహారతి, సప్తహారతి, నక్షత్ర హారతి మహా మంగళ హారతి కార్యక్రమాలను భక్తులను ఆకట్టుకునేలా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదానం చేశారు.

వరి రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి


ఏఓ శ్రావణి

కేవీపల్లె : భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో వరి పంట సాగు చేసిన రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రావణి అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురిసే సమయంలో వరికోత చేపట్టరాదని తెలిపారు. వరిపొలంలో నీరు నిల్వ లేకుండా కాలువలు తీయాలని సూచించారు. వర్షంతో తడిసిన పొలంలో వరిగింజ రంగు మారకుండా ఉండేందుకు కార్బెండిజం 1 గ్రాము, మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వరి కంకుల బరువుతో చిన్నగాలికి కూడా నేలమీద పడిపోయే అవకాశం ఉందని, అలా జరిగితే పంటను కత్తిరించి కట్టలుకట్టి కుప్పలుగా వేసి తార్పాలిన్ పట్టలతో కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట నీటిలో తడిస్తే మొలక రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని కోరారు.

వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం అభినందనీయం

నిమ్మనపల్లె: వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని రాజంపేట పార్లమెంట్ వాల్మీకి బోయ సాధికార సమితి కన్వీనర్ కే లక్ష్మన్న అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు మహర్షి వాల్మీకి ఘనతను గుర్తించి వాల్మీకుల మనోభావాలను స్వాగతిస్తూ అక్టోబర్ 17వ తేదీన వాల్మీకి జయంతి దినోత్సవాన్ని అన్ని జిల్లాలలో అధికారికంగా రాష్ట్ర పండుగగా జరుపుకోవాలని ఉత్తర్వులు జారీ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి కుటుంబ సభ్యులందరూ వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా వాల్మీకి జయంతిని ప్రభుత్వ సెలవు దినముగాను ప్రకటించాలని వాల్మీకి సంఘాలు అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, నాయకులు కె.చంద్రాయుడు, సహదేవ, పవన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పట్టుగూళ్ల మార్కెట్

- పడకేసిన సౌకర్యాలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

మదనపల్లె సిటీ: రాయలసీమలోనే ఎంతో ప్రఖ్యాతిగాంచిన మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్ అధ్వానంగా తయారైంది. మార్కెట్ లోపలికి వెళితే దుర్వాసన, చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. దీంతో రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. ఒకప్పుడు రైతులతో కిటకిటలాడిన మార్కెట్ నేడు నిరాదరణకు గురైంది. గతంలో ప్రతి రోజు 4 వేల నుంచి 5 వేల క్వింటాళ్ల గూళ్లు వచ్చేవి. రైతులు, రీలర్లతో కిటకిటలాడేది. పట్టుగూళ్లను తీసుకువచ్చే రైతులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సుదూరప్రాంతాల నుంచి వచ్చిన రైతులు విశ్రాంతి తీసుకోవడానికి కూడా సౌకర్యం లేదు. మార్కెట్‌లో పల గదులు పాడైపోయాయి. రైతులు గూళ్లను పోసేందుకు ఏర్పాటు చేసిన జల్లెడలు తుప్పుపట్టాయి. కొన్నింటి కింద భాగం దెబ్బతిన్నాయి. విక్రయ కేంద్రంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పాడైపోయాయి. ధరల చూపించే ఎలక్ట్రిక్ బోర్డు నిరుపయోగంగా మారింది. పై కప్పు పగలిపోయి వర్షాకాలంలో ఉరుస్తోంది. మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. తాగేందుకు నీటి సౌకర్యం లేదు. పరిసర ప్రాంతాలు పిచ్చిచెట్లతో నిండిపోయింది. మార్కెట్‌కు రోడ్డు కూడా కంకర తేలిపోయింది. అధికారులు,సిబ్బంది రోజు వస్తున్నారే తప్ప దీనిపై పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.



మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్


పనిచేయని ఎలక్ట్రానిక్ ధర బోర్డు


పాడైపోయిన పట్టుగూళ్ల జల్లెడలు

పట్టుగూళ్లు రాక బోసిపోయిన మార్కెట్

మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్‌కు గూళ్లు రాక బోసిపోతుంది. గత రెండు నెలల నుంచి గూళ్లు సక్రమంగా రావడం లేదు. నెలలో నాలుగైదు రోజులు తప్ప అది కూడా తక్కువ కిలోలు వస్తున్నాయి.

మార్కెట్ అభివృద్ధికి చర్యలు

మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. నిధులు వచ్చిన వెంటనే మార్కెట్‌ను ఆధునీకరిస్తాం.

-లక్ష్మిదేవి, పట్టుగూళ్ల మార్కెట్ సెక్రటరీ

నిబంధనలకు విరుద్ధంగా సెక్రటరీ నియామకం

– డీపీఓకు ఫిర్యాదుచేసిన బహుజన యువసేన


స్థానికురాలిని సెక్రటరీగా నియమించడంపై డీపీఓ ధనలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న బీవైఎస్ అధ్యక్షులు పునీత్

మదనపల్లె : పంచాయతీరాజ్ చట్టం, అడ్మినిస్ట్రేటివ్ రూల్స్‌కు విరుద్ధంగా అంకిశెట్టిపల్లె పంచాయతీకి చెందిన స్థానికురాలిని, అదే పంచాయతీలో సెక్రటరీగా నియమించడంపై జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మికి బహుజన యువసేన సభ్యులు ఫిర్యాదు చేశారు. సోమవారం డీపీఓ ధనలక్ష్మిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ మాట్లాడుతూ...పంచాయతీరాజ్ చట్టం, అడ్మినిస్ట్రేటివ్ రూల్స్, పంచాయతీ సెక్రటరీల నియామకాల జీఓ ప్రకారం పంచాయతీ సెక్రటరీలను వారి స్థానిక పంచాయతీల్లో నియమించకూడదనే నిబంధన ఉందన్నారు. ఈ నిబంధనను ఏమాత్రం పట్టించుకోకుండా ఉన్నతాధికారులు మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ సెక్రటరీగా స్థానికురాలైన మంజులను నియమించారన్నారు. మంజుల నియామకాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారని, ఆమె కుటుంబంతో పలువురికి విభేదాలు ఉన్న నేపథ్యంలో..కొందరిపై ఆమె స్వార్థంతో, పక్షపాతం చూపించే అవకాశం ఉందన్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడటమే కాకుండా, ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాల విషయంలో తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందన్నారు. సెక్రటరీ మంజుల నియామకం ప్రభుత్వ నియమనిబంధనలకు వ్యతిరేకంగా జరిగినందున ఆమెను అంకిశెట్టిపల్లె సెక్రటరీ బాధ్యతల నుంచి తప్పించి, వేరొకచోటకు బదిలీ చేసి, వేరొకరిని ఆమె స్థానంలో నియమించాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు చిరంజీవి, నవీన్, జగదీష్, సాదిక్, స్థానికులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ సర్వే సమస్యలు పరిష్కరించుకోండి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

గుర్రంకొండ: ఫ్రీహోల్డ్ భూముల సర్వేలో సమస్య ఉన్న రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూముల సర్వే కార్యక్రమం జరుగుతోందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలపట్ల అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో నాలుగురోజుల పాటు అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మండల వైద్యాధికారి రవీంద్రనాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యపనులపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తే రోగాలు ప్రబలు కుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. ఎంపీడీవో వెంకటేశులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలన్నారు. పంచాయతీలకు, మండలానికి మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, వైస్ ఎంపీపీలు కరుణాకర్, సరస్వతి, ఎంపీటీసీలు బాబయ్య, యాకూబ్, రాజగోపాల్, సర్పంచ్ రౌనఖ్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తెలిపిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి సబ్ కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు. ఏమైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఎం.మణి(9966366709), కె.భరత్ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు(9490827676), హరిబాబు రాత్రి 10 గంటల నుంచి 16 ఉదయం 6 వరకు(9640510195), శ్రీరాములు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు(99899176247), కె.సోహిల్ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకు (9490827676), శ్రీకాంత్ రాత్రి 10 నుంచి 17వ తేదీ ఉదయం 6 వరకు (6303308475), జోహార్ బేగ్ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు(8309606907), పి.రామమోహన్ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకు (9490265119), వై.ఆనంద్ రాత్రి 10 నుంచి 18 ఉదయం 6 వరకు(9989407862) అందుబాటులో ఉంటారన్నారు. వీరికి ఫోన్ చేసి సమాచారం తెలపాలన్నారు. పొలాల్లో పని చేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద, స్తంభాల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పట్టాభిరాముడి పవిత్రోత్సవాలకు అంకురార్పణ


అంకురార్పణ నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం: టీటీడీ ఆధ్వర్యంలోని స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో అంకురార్పణ కార్యక్రమం సోమవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు మూలవర్లకు అభిషేకం, 7గంటలకు అలంకరణ, తోమాలసేవ, పంచాంగశ్రవణం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7గంటలకు స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, సేనాధిపతి ఉత్సవం, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదపండితల మంత్రోచ్ఛరణల నడుమ అంకురార్పణ కన్నులపండువగా సాగింది. కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, అలయ అర్చకులు కృష్ణరాజ్‌భట్టర్, బాషికాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు


జ్యోతులను ఊరేగిస్తున్న భక్తులు

కలకడ : మండలంలోని చౌడేశ్వరిదేవిని ఆలయ కమిటీ సభ్యులు, తొగట వీరక్షత్రియులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింహ వాహనంపై కలకడ పురవీధులలో అమ్మవారు ఇంటింటి పూజలు అందుకున్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి జ్యోతుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కలకడ ఇందిరమ్మ కాలనీ, కె.బాటవారిపల్లె, నీలప్పగారిపల్లె నుంచి భక్తులు నం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బాలయ్యగారిపల్లె సర్పంచ్ విశ్వనాథ ఇంటి నుంచి బిందె సాగ్యం తీసుకుని పులకింతల నీటితో పవిత్ర జ్యోతులు తయారు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి రథం ముందు మహిళల కోలాటం ఆకట్టుకుంది. జ్యోతుల మహోత్సవంలో రాష్ట్ర తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు మోదెం రెడ్డిపరంజ్యోతి వీరాంజనేయప్రసాద్ దంపతులు, మహిళ అధ్యక్షురాలు సురువు శ్రీలతమధుసూదన్ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

గ్రామాల అభివృద్ధికి శ్రీకారం


పీలేరు:సీసీ రోడ్లకు భూమిపూజ నిర్వహిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : మండలంలోని గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని మేళ్లచెరువు, తలపుల, జాండ్ల గ్రామాల్లో పల్లెకు పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు గ్రామాల్లో ఏడు సీసీ రోడ్లకు కూడా రూ. 16 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. సంబంధిత పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీవో నందకుమార్‌రెడ్డి, పీఆర్ డీఈ మధుసూదన్, ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, ఏపీవో మహేశ్వర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించి పనులను ప్రారంభించారు. ప్రతి పల్లెనూ ప్రగతి పథంలో నిలపడమే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు లక్ష్యంగా ఉన్నారన్నారు. అలాగే మండలంలోని అయ్యవారిపల్లి, నగిరిమడుగు, ముష్టూరువాండ్లపల్లి, గండబోయనపల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సుధాకర్ రెడ్డి, పిఆర్ ఏఈ కమలాకర్ రెడ్డి, నాయకులు ఆనంద, మల్లికార్జున రెడ్డి, వల్లిగట్ల వెంకటరమణారెడ్డి, దామోదర్ రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో పల్లెపండగ

కలకడ : అభివృద్ధి పనులు చేపట్టడంతోనే పల్లెపండుగ అని మండల కో ఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, బాలయ్యగారిపల్లె సర్పంచ్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ వారోత్సవాలు చేపట్టారు. బాలయ్యగారిపల్లె, కలకడ, పంచాయతీలలో రూ.14లక్షలు నిధులు ఉపాధిహామీ పథకం ద్వార చేపట్టే సిమెంట్ రోడ్లు నిర్మాణం పనులకు భూమి పూజ నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, ఏపీఓ, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

వాల్మీకిపురం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీడీఓ మనోహర రాజు అన్నారు. సోమవారం మండలంలోని జర్రావారిపల్లిలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కేవీపల్లె : గ్రామాల అభివృద్ధే లక్ష్యమని ఎంపీడీవో సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని ఎం వీపల్లె పంచాయతీ మేకలవారిపల్లెలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించి అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో రూ.15 లక్షలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో సీసీరోడ్లు తదితర పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కోత పనులు వాయిదా వేసుకోండి

– ఏడీఏ శివశంకర్



మదనపల్లె : అధిక వర్షం, తుపాను నేపథ్యంలో రైతులు ఎటువంటి కోతపనుల జోలికి పోకుండా నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని మదనపల్లె డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు శివశంకర్ సూచించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...మదనపల్లె అగ్రి డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి మడికయ్యల్లో నిలిచిన వర్షపునీరు పోయేందుకు చిన్న కాలువలు తీసి, నీటిని బయటకు పంపడం వలన పంటకు ఎటువంటి నష్టం కలగదన్నారు. వేరుశనగను పీకేసిన రైతులు పొలాల్లో టార్పాలిన్ పట్టతో కప్పి ఉంచాలన్నారు. అలాగే రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బంది, మండల వ్యవసాయాధికారులు తమ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉండటమే కాకుండా, ఎటువంటి సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించాలన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

పెద్దతిప్పసముద్రం: పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం తుమ్మరకుంట, మల్లెల గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ యోగానంద్ తెలిపారు. మల్లెలలో 2, తుమ్మరకుంట పంచాయతీలో 26 పనులకు సంబంధించి భూమిపూజ చేసామన్నారు. సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, ఏపీడీ మధుబాబుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం


డబ్బును అందజేస్తున్న శ్రీనివాస డిగ్రీ కాలేజీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి

మదనపల్లె సిటీ: వెన్నెముక కండరాల క్షీణత జబ్బుతో బాధపడుతున్న చిన్నారి శ్రీనికకు శ్రీనివాస డిగ్రీ కాలేజీ ఆర్థిక సాయం అందించారు. కాలేజీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి సిద్దార్థ సంస్థల చైర్మన్ క్రిష్టారెడ్డిలు రూ.23 వేలు డబ్బులు అందజేశారు. చిన్నారి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంటంతో వివేకానంద ఆశయం ఫౌండేషన్ కాలేజీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాలేజీ యాజమాన్యం స్పందించారు.

లావాదేవీలపై అవగాహన అవసరం

– డీఎం షఫీక్

సుండుపల్లె : మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఖాతాదారులకు బ్యాంక్ లావాదేవీలపై బ్రాంచ్ మేనేజర్ మస్తాన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎం షఫీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1906వ సంవత్సరంలో సుబ్బారావు కెనరా బ్యాంక్‌ను స్థాపించారని, ఈ బ్యాంక్ ద్వారా ఖాతాదారులు ఎడ్యుకేషన్ లోన్‌లు, వాహనాల లోన్లు, వ్యాపారాలకు లోన్లు పొందవచ్చని తెలిపారు. మహిళలకు జీరో అకౌంట్, సేవింగ్స్ అకౌంట్లతపాటు ఏజెంట్ అకౌంట్‌లు అందబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అకౌంట్ ద్వారా మహిళలకు క్యాన్సర్ వ్యాధి చికిత్సకు రూ.10 లక్షలు వరకు లబ్ది పొందవచ్చని తెలిపారు. అలాగే ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా ద్వారా రూ. 430లు చెల్లిస్తే బీమాదారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షలు వరకు వెంటనే లబ్ది పొందచ్చని తెలిపారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సిమ్మి, లిటిల్ ఫ్లవర్ స్కూల్ నాగేశ్వర, బాబు రెడ్డి, వెలుగు ఆఫీస్ యానిమేటర్లు, కెనరా బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం


:బహుదా ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ ధనుంజయులు

నిమ్మనపల్లె : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో 15, 16 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టు మండలంలోని వివిధ శాఖల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ధనంజయులు అన్నారు. సోమవారం మండలంలోని బహుదా ప్రాజెక్టును ఇరిగేషన్ ఏఈ శ్రీహరిరెడ్డితో కలిసి పరిశీలించి, ప్రాజెక్టులోని నీటి మట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. మంగళ, బుధ గురు వారాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండలంలో రెవెన్యూ , ఇరిగేషన్ , పోలీసు యంత్రాంగం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. అధికారులకు కేటాయించిన చెరువులను ముందస్తుగా పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాలని, చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. తాసిల్దార్ కార్యాలయంలో మూడు రోజులపాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.భారీ వర్షాల కారణంగా అత్యవసర సేవల కై ప్రజలు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి బాధ్యతల స్వీకరణ


డీఎల్‌డీఓ అమరనాథ్

మదనపల్లె : మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీఓ)గా అమరనాథరెడ్డి స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎల్‌డీఓగా పనిచేస్తున్న వి.లక్ష్మీపతి ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో రాయచోటికి బదిలీకాగా, ఆయన స్థానంలో అనంతపురం నుంచి అమరనాథరెడ్డి మదనపల్లెకు బదిలీపై వచ్చారు. సోమవారం బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థ పనితీరును పర్యవేక్షించడంతో పాటు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ పరిధిలోని సచివాలయాల్లో తనిఖీలు నిర్వహించి కార్యకలాపాలు సజావుగా సాగేలా చూస్తామన్నారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. సోమవారం ఆయన స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ కాలువలు, మ్యాన్ హోల్స్, కల్వర్టులకు, వంకలు, వాగులకు దూరంగా ఉండాలని కోరారు. వర్షంతో పిడుగులు పడే అవకాశం ఉన్నందున వ్యవసాయ కూలీలు, గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండరాదన్నారు. వర్షపునీరు నిల్వతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున్న తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు విక్టరీ వెంకటరమణారెడ్డి, నాగభూషణం, పిక్కా రమణ, సాంబశివారెడ్డి, కాలేషా, సచిన్, పరమేష్. ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పెద్దమండ్యం: భారీ, అతి భారీ వర్షాల నేపథ్యంలో గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్‌వోలు, వీఆర్ఏలతో ఆయన సమీక్షించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నాలుగు రోజుల పాటు ఉంటుందన్నారు. ఎక్కడైనా పంట నష్టం జరిగినా, చెరువులు, కుంటలు తెగిపోయే ప్రమాదం ఉన్నా ముందస్తుగా సమాచారం అదించాలఅన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వో, వీఆర్ఏలకు విధులను కేటాయించినట్లు తహసీల్దార్ తెలిపారు.

వేడుకగా ఆలయ పునఃప్రతిష్టాపనోత్సవాలు

రామాపురం : మండల పరిధిలోని నీలకంఠరావుపేటలో నూతనంగా పునఃనిర్మించబడిన శ్రీ రామ దూత అభయహస్త ఆంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి బుధవారం వరకు హనుమాన్ ధ్వజ, శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈ ఆలయంలో గత మూడు శతాబ్దాలకు పైబడి కొంత భాగం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన దేవదాయ శాఖ అధికారులతో సంప్రదించి నిధుల విడుదలకు కృషి చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం మహాగణపతి పూజ, స్వస్తిహవాచనం, అంకురార్పన ఇతరత్రా పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

న్యూక్లియర్ నిర్వహణపై అవగాహన

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో న్యూక్లియర్ ప్రయోజనాల నిర్వహణ రహిత ట్రాన్స్‌ఫార్మర్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గెస్ట్ లెక్చర్‌కు చెన్నై సైంటిస్టు బి.శ్రీనివాసులరెడ్డి హాజరయ్యారు. సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించారు.